శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## వర్షాన్ని సైతం లెక్కచేయని భక్తులు
## 6 వ రోజుకు చేరుకున్న కోటి కుంకుమార్చన



**బుచ్చి జులై 25 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయి సన్నిధిలో జరుగుతున్న కోటి కుంకుమార్చన 6 వ రోజుకు చేరుకుంది.కోటి కుంకుమార్చనకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు,పాలక మండలి సభ్యులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. భక్తులు కూడా వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం ఉభయకర్తలకు ఆహ్వానంతో కార్యక్రమం ప్రారంభం అయింది. మొదట గోపూజ, వృషబార్చన,లక్ష్మీగణపతిపూజ,స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి నవావరణపూజ, కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయింత్రం కౌమారి పూజ,సుహాసిన పూజ, శ్రీవార్ల శాంతి కళ్యాణం, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా చెన్నైకి చెందిన దశరధరామిరెడ్డి,ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్ధ అధినేత శ్రీనాయుడు.ఆదికేశవరెడ్డి, కామాక్షమ్మ దంపతులు, నెల్లూరు వాస్తవ్యులు పి శంకర్‌రెడ్డి, స్మిత దంపతులు, పి హేమ మహేశ్వర్‌రెడ్డి, దంపతులు, అమృత మిల్క్ అదినేత ఆర్ మల్లికార్జునరావు దంపతులు, పి సతీష్‌కుమార్‌రెడ్డి దంపతులు బి హరిప్రసాద్‌రెడ్డి దంపతులు, కామేశ్వరరావు దంపతులు వ్యవహరించారు.భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.భక్తులు పెద్దఎత్తున పాల్గోని అమ్మవారిని దరి ్శంచుకొని ఆమె కృఫకు పాత్రులు కావాలని చైర్మన్,పాలక మండలి సభ్యులు పిలుపునిచ్చారు.

## వాచ్‌మెన్ హత్య



**నెల్లూరుక్రైమ్, జూలై 25, ప్రభాతవార్త** నగరంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ తూర్పు ప్రాంతంలో ఓ వ్యక్తి మృతి చెందాడన్న సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని హత్య కేసుగా నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం స్థానిక రంగనాయకులపేటలో మల్లెపూల సుబ్రహ్మణ్యం(41) తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లుగా తెలిపారు. సుబ్రహ్మణ్యం గత మూడు నెలల నుంచి రైల్వే స్టేషన్ తూర్పు ప్రాంతంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడని సోమవారం రాత్రి ఎవరో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సుబ్రహ్మణ్యంతో గొడవపడి కొట్టడం వల్లే మృతి చెందాడని తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని శవపంచనామ కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. టూటౌన్ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఉన్నటువంటి సీసీ కెమెరాలను పరిశీలించిన తర్వాత నిందితులు ఎవరు అనేది తెలుస్తుందని తెలిపారు.

## అండర్‌బ్రిడ్జిలలో వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోండి



**నెల్లూరు కార్పొరేషన్, జూలై25,ప్రభాతవార్త** నగర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ప్రజా జీవనానికి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు వహించాలని వర్షపునీరు అండర్ బ్రిడ్జిలలో నిల్వకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కమీషనర్ ఆదేశించారు. వర్షాలకు నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రధాన డ్రైన్లు, మార్గాలు, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలు, మాగుంట లేఅవుట్, విజయ వమల్ గేట్, రామలింగాపురం అండర్ బ్రిడ్జిలు, పంపింగ్ స్టేషన్ల వద్ద పరిస్థితిని అధికారులతో కలిసి కమీషనర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో కార్పొరేషన్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన సేవలు అందించేందుకు సిద్దంగా ఉండాలని స్పష్టం చేశారు. రహదారులు, రోడ్లు, అండర్ బ్రిడ్జి ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు మోటర్ల ద్వారా తోడివేయాలని తెలిపారు. ముఖ్యంగా పాదచారులు, వాహణ చోదకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రధాన ప్రాంతాలలో అధికారులు పర్యవేక్షించాలని కమీషనర్ ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ప్రజలు భారీ వృక్షాల సమీపంలో నిలవడం, విద్యుత్ స్తంభాలను తాకడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని కమీషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సంపత్‌కుమార్, చంద్రయ్య, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలు



**నెల్లూరు,జులై25 ప్రభాతవార్త-విద్య** గత మూడు రోజులుగా నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో నిర్వహించిన అండర్-17 రాష్ట్రస్థాయి బాలబాలికల బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఉత్తమ ప్రతిభ కనపరచిన వారికి ముగింపు సందర్భంగా బహుమతులు ప్రధానోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా విజయాడెయిరీ చైర్మన్ కొండ్రెడ్డిరంగారెడ్డి పాల్గొని మాట్లాడుతు బాడ్మింటన్ ఇడోర్‌స్టేడియం మరమత్తులకు ప్రభుత్వం నుండి రూ 2 కొట్టరూపాలయ గ్రాంట ను విడుదల చేపిచేందుకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సుముఖత వ్యక్ ్తంచేయటం జరిగిందన్నారు. ఇండోర్ స్టేడియం ఆదునీకర గావించి జాతీయ, అంతర్జాతయా పోటీలు నగరంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మెగళ్లపాలెం ఇండోర్ స్టేడియంలో బాడ్మింటన్ అకాడమినీ ఏర్పాటుచేసి క్రీడాభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ముక్కాల ద్వారకానాద్ మాట్లాడుతు ఈ పోటీల్లో రాష్ట్రంలోని 250 మందికి పైగా క్రీడాకారులు, 50మందికి పైగా టెక్నికల్ అఫీషియల్స్, కోచ్స్, టీం మేనేజర్స్ పాల్గొనటం సంతోషదాయకమన్నారు. కరోనా అనంతరం రాష్ ్ట ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సిఎం కప్, రాష్ట్రస్దాయి స్పోర్ట్స్ అండ్‌గేమ్స్‌ను నిర్వహించి క్రీడాకారుల్లో నూతన ఉత్తేజాన్ని నింపారాన్నరు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ఆడుదాం ఆంధ్రా అనే నూతన విధానంతో గ్రామీణ స్థాయి క్రీడలు ప్రోత్సహించేందుక చర్యలు తీసుకోవటం శుభపరిణామమన్నారు. సెప్టెంబరులో విజయవాడలో యునెక్స్ సన్‌రైజ్ ను ముఖ్యమంత్రి చేతులమీదుగా నిర్వహించనున్నామని పేరొ ్కన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడలను మరింత విస్తరించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు. క్రీడల్లో గెలుపోటములు సాధారణమని, ఓడిన వారు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ప్రయత్నించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలోఅసోసియేషన్ అధ్యక్షులు దూడల సుధాకర్, కార్యదర్శి నిమ్మల వీర వెంకటేశ్వర్లు, కోశాధికారి వెంకట శ్రీకాంత్, సీనియర్ క్రీడాకారులు కోట సూర్యనారాయణ, సభ్యులు రామ్మోహన్, వరప్రసాద్, పేర్ల సీతారామయ్య, చీఫ్‌కోచ్ ఆర్‌కె.యతిరాజ్, సూపరిండెంట్ విజయ్‌కుమార్, కోచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**విజేతలు వీరే:** మూడురోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల బాడ్మింటన్ టోర్నమెంట్‌లో మిక ్సడ్ డబుల్స్ విభాగంలో గుంటూరుకు చెందిన డి.దీపిక, ఎండి కరమత్ ఉల్‌హక్ లు విజేతలుగా నిలిచారు. గర్ల్స్ సింగిల్స్‌లో కడపకు చెందిన జి.పూజిత బాయ్స్ సింగిల్స్‌లో నగరానికి చెందిన టి.అనినేష్ విజేతులుగా నిలిచారు. గర్ల్స్ డబుల్స్ విభాగంలో గుంటూరుకు చెందిన డి.దీపిక, డి.స్రవంతిలు విజయ దుందుబి మోగించారు. అలాగే బాలుర డబుల్స్ విభాగంలో ఎండి కరమత్ ఉల్‌హాక్, నగరానికి చెందిన విఎస్ మణికంఠరెడ్డిలు విజేతలుగా నిలిచారు.

## టీడీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా శ్రీధర్‌రెడ్డి

**నెల్లూరు జూలై 25, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో, రాష్ట్ర అధ్యక్షుడు కింజెరపు అచ్చెన్నాయుడు నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని నియమిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి మంగళవారం వెలువడిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## కావలి తీర ప్రాంతంలో ఎగిసిపడుతున్న అలలు

**కావలి రూరల్, జులై 25 ప్రభాతవార్త** వాయుగుండం ప్రభావంతో కావలి రూరల్ మండలంలోని తీర ప్రాంతంలో మంగళవారం అలలు ఎగిసిపడ్డాయి. దీంతో చేపల వేటకు వెళ్లే వారిని, సముద్రస్నానానికి వెళ్లే వారిని వెళ్లనీయలేదు. అలలు ఉధృతంగా ఎగిసిపడుతుండటంతో మెరైన్ ఎస్ఐ నారాయణ ఆధ్వర్యంలో తీర ప్రాంతంలోని పలు బీచ్‌లలో ఎవరిని కూడా సముద్రంలోకి దిగనీయకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా వున్నందున ఎవరు కూడా సముద్రంలోకి దిగవద్దని మెరైన్ ఎస్ఐ నారాయణ సూచించారు. మత్స్యకారులు తమతమ వలలను, బోట్లను ఎత్తైన ప్రదేశాలకు తరలించారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించాలన్నదే సంకల్పం





**కావలి, జులై 25 ప్రభాతవార్త** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ఫలాలు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాకరంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ మంగళవారం కావలి, ఉదయగిరి నియోజవర్గాల్లోని కొన్ని మండలాలలో చేసిన సుడిగాలి పర్యటనలు అధికారుల్లో దడపుట్టించాయి. ఆయా శాఖల అధికారులు ఎటువంటి ఉపద్రవాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని బెంబేలెత్తిపోయారు. కావలి నియోజకవర్గంలోని రూరల్ మండలం సర్వాయపాళెంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరాన్ని పరిశీలించారు. ప్రజలకు అందజేస్తున్న సర్టిఫికేట్ల వివరాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న 11 రకాల దృవీకరణ పత్రాలలో అవసరమైన సర్టిఫికేట్లను ప్రజలు వాలంటీర్ల ద్వారా పొందాలని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీ...**
సర్వాయపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు రెండో విడత పనులను ప్రధానోపాధ్యాయులు వెంకట రమణను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులు అందకూడదన్నారు.

**కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్....**
కావలి మున్సిపాల్టీ పరిధిలో ముసునూరులోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ పరిశీలించారు. కళాశాలలోని తరగతి గదులు, స్టోర్ రూమ్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థినీలకు అందిస్తున్న భోజన వివరాలను హెచ్‌యం సంధ్యారాణిని అడిగి తెలుసుకున్నారు. ఈ కళాశాల ఆవరణలో అసంపూర్తిగా వున్న భవన నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట కావలి ఆర్డీవో శీనానాయక్, కావలి తహశీల్దార్ మాధవరెడ్డి, ఎంఇవోలు గోవిందయ్య, వెంకట సుబ్బయ్య, జిసిడివో టి.మమత తదితరులు పాల్గొన్నారు.

## రొట్టెల పండుగ ఏర్పాట్లపై అధికారులతో మేయర్ స్రవంతిజయవర్ధన్ సమీక్ష



**నెల్లూరు కార్పొరేషన్, జూలై25,ప్రభాతవార్త** దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫెస్టివల్‌గా గుర్తింపు పొందిన నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ ఈనెల 29నుండి ప్రారంభం కానున్న సందర్భంగా నెల్లూరు నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ అధికారులతో కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో ఆమె మంగళవారం సాయంత్రం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. షామియానాలు, కమాండ్ కంట్రోల్ విభాగం, విఐపీ రిసెప్షన్, సీసీ కెమెరాలు, విద్యుత్ లైటింగ్, పారిశుధ్యం, స్త్రీలకు మరుగుదొడ్లు, పార్కింగ్, మహిళలకు రక్షణ, బారికేడ్ల నిర్మాణం, పోలీసుల పర్యవేక్షణ, స్వర్ణాల చెరువు తీరం వెంబడి భద్రతా చర్యలు వంటి వివిధ అంశాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూ రానున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణంలో అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాలు ఎక్కువగా పడుతున్నందువలన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మేయర్ సూచించారు. దర్గా ప్రాంగణంలో నిర్మించిన మరుగుదొడ్లతో పాటు తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న మరుగుదొడ్ల వద్ద పారిశుధ్య నిర్వహణను ప్రణాళికబద్దంగా నిర్వహించాలని సూచించారు. రొట్టెల పండుగ జరిగే స్వర్ణాల చెరువు తీరంతో పాటు దర్గా పరిసర ప్రాంతాలు, రోడ్డు మార్గాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. దర్గా, స్వర్ణాల చెరువు ప్రాంగణాల్లో వివిధ విభాగాలను సూచించే సూచికలను విస్తృతంగా ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని మేయర్ సూచించారు. దర్గా ప్రాంగణంలో అవసరమున్న అన్ని విభాగాల్లో బారికేడ్లను ఏర్పాటు చేసి భక్తుల మధ్య తొక్కిసలాట జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా రొట్టెల మార్చుకునే స్వర్ణాల చెరువును అత్యంత పరిశుభ్రంగా ఉంచి, నీటిని నిరంతరం శుద్ధి చేస్తూ ఉండాలని అధికారులకు మేయర్ చెప్పారు. అన్ని ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుని రొట్టెల పండుగను ఘనంగా నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామనివెల్లడించారు. నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, హెల్త్ విభాగం అధికారులు, పాల్గొన్నారు.

## మున్సిపాల్టీలకు చెందిన కోర్టు కేసుల్ని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి



**కావలి, జులై 25 ప్రభాతవార్త** మున్సిపాల్టీలకు సంబంధించి కోర్టుల్లో పెండింగ్‌లో వున్న కేసుల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లను మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ గొట్టిపాటి శ్రీనివాసరావు ఆదేశించారు. కావలి మున్సిపల్ కార్యాలయంలో పాత నెల్లూరు జిల్లాకు సంబంధించిన మున్సిపల్ కమిషనర్లతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కావలి, అల్లూరు, ఆత్మకూరు, గూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, నాయుడుపేట, వెంకటగిరి, సూళ్ళూరుపేట మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఆయా మున్సిపాల్టీల పరిధిలో కోర్టులో వేసిన కేసుల వివరాలపై సమీక్ష నిర్వహించారు. పాత నెల్లూరు జిల్లాలోని మున్సిపాల్టీలలో ప్రస్తుతం 102 కేసులు పెండింగ్‌లో వున్నాయని ఈ కేసుల్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కమిషనర్లను ఆదేశించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. మున్సిపాల్టీలలో కోర్టులో పెండింగ్‌లో వున్న కేసులపై గత కొన్ని రోజులుగా అధ్యయనం చేస్తున్నామన్నారు. పాత నెల్లూరు జిల్లాలోని మున్సిపాల్టీలలో 102 కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో వున్నాయన్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లో 92 కేసులు వున్నాయన్నారు. వీటిల్లో ఎక్కువగా ఆక్రమణలకు సంబంధించిన కేసులు, అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లుల కేసులు వున్నాయన్నారు.

**అక్రమ లేఅవుట్లపై కొరడా ఝుళిపించాలి....**
కావలి మున్సిపాల్టీ పరిధిలో చోటుచేసుకున్న అక్రమ లేఅవుట్లు, ఈ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల అనుమతులపై రీజినల్ డైరెక్టర్ గొట్టిపాటి శ్రీనివాసరావు స్పందించి మాట్లాడారు. అక్రమ లేఅవుట్లను నియంత్రించాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లపై వుందన్నారు. అక్రమ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. అక్రమ లేఅవుట్లలను గుర్తించిన వెంటనే హద్దు రాళ్లను తొలగించాలన్నారు. అక్రమ లేఅవుట్లలోని రోడ్లను ధ్వంసం చేయాలన్నారు. ప్లాట్లు రిజిస్ట్రేషన్ కాకుండా రిజిష్టర్ కార్యాలయంలో ఆపాలన్నారు. నుడా అధికారులు అనుమతులు ఇచ్చినా వాటిపై చట్టపరమైన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత కావలి మున్సిపల్ అధికారులదేనన్నారు. ఈ అక్రమ లేఅవుట్ల వివరాలు, చట్టవిరుద్ధ నిర్మాణాలకు అనుమతులపై చర్యలు చేపట్టేలా చేస్తామన్నారు. చట్టవిరుద్ధంగా అక్రమ లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలు అరికట్టని అధికారులపై చర్యలు వుంటాయని ఆయన హెచ్చరికలు చేశారు.

## రోడ్డుపైన పడిపోయిన చికిన్ వ్యర్థాలు.. వాహనాలు అడ్డుకున్న గ్రామస్తులు



**సంగం జులై 25 ప్రభాతవార్త** దుర్గంధభరితమైన చికెన్ వ్యర్ధాలు రోడ్డుపైన పడిపోవడంతో సంగం మండలంలోని దువ్వూరుగ్రామస్తులు వాహనాలను అడ్డుకున్నారు. సోమవారం చికెన్ వ్యర్ధాలు తీసుకొని వెళుతున్న లారీలో నుండి మాంసం ముద్దులు రోడ్డుపైన పడిపోయాయి.దుర్గందమై వాసన వెదజల్లింది.దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.నిత్యం చేపలగుంటలలో వేసేందుకు చికిన్ వ్యర్ధాల వాహనాలు తమ గ్రామంలో నుండి వెళుతున్నాయని కనీసం గుంటలలో ఏమి మేత వేస్తున్నారో కూడా మత్యశాఖ అధికారులు పరిశీలించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.గుంటలలో చికిన్ వ్యర్ధాలు వేసినందువల్ల ఆనీటిని పంట కాలువలలోకి వదిలినందువల్ల రైతులు పూర్తి స్థాయిలో నష్టపోతున్నారని జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్‌పి సంగం మండలంలో చేపల గుంటల విషయంపై విచారణ జరపాలని వారు కోరారు.

## మెడికల్ కళాశాల ప్రతిపాదిత రుసుమును రద్దు చేయాలి

**నెల్లూరు జూలై 25, ప్రభాతవార్త-వైద్యం** ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న మెడికల్ కళాశాల ప్రతిపాదిత రుసుము నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎంవి రమణయ్య, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్టు మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మరో రెండు నెలల్లో 5 కొత్త మెడికల్ కళాశాలలు, మరో రెండు ఏళ్లలో ప్రారంభించబోతున్న మరో 12 కళాశాలల స్థాపనలో ఏపీ నాయకత్వ కృషి ఏనలేనిదన్నారు. అయితే జీవో నంబరు 108లో పేర్కొన్న విధంగా సెల్ఫ్ రుసుము విధానం మాత్రం చాలా ప్రమాదకరమన్నారు.ఈ ఉత్తర్వు ప్రకారం ప్రభుత్వ కళాశాలలో ఉన్న 15శాతం సీట్లు కేంద్ర ప్రభుత్వ వాటాకి పోగా మిగిలిన 85శాతం సీట్లను మూడు గ్రూపులుగా విభజించబడింది. 50శాతం జనరల్ సీట్లు, 35శాతం సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు, 15శాతం ఎన్‌ఆర్ఐ సీట్లు, ఒక్కో కేటగిరికి సంబంధిత రుసుము ఏడాదికి జనరల్ కేటగిరికి రూ.15వేలు, సెల్ఫ్‌ఫైనాన్స్ కేటగిరికి రూ. 12లక్షలు, ఎన్‌ఆర్ఐకి రూ.20లక్షలు నిర్ణయించారు. వీటివల్ల ఫీజుల వసూళ్లలో ప్రతికూల పరిణామాలకు దారి తీస్తుందన్నారు. మీరు తీసుకున్న ప్రైవేటు కళాశాల మాదిరిగానే ఉందని, ప్రభుత్వానికి ప్రైవేటుకి తేడా లేకుండా పోయిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర వర్గాలకు రిజర్వేషన్ ప్రయోజనాలను పరిరక్షించి బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని ఆ లేఖలో ఆయన కోరారు.

## పేద ప్రజల అభివృద్ధికి పెద్ద పీఠ వేస్తున్న సియం జగన్



**సెల్లటూరు(రాపూరు), జూలై25ప్రభాతవార్త** రాష్టంలోని పేద ప్రజల అభివృద్ధికి రాష్ట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్ద పీఠ వేస్తున్నట్లు తిరుపతి జిల్లా వైసిపి ఆధ్యక్షుడు,రాష్ట కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాపూరు మండలంలోని కంభాలపల్లిసచివాలయం పరిధిలోని సెల్లటూరు,కుమ్మరిగుంట,కండలేరు డ్యాం గ్రామాలలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జోరువానలో సైతం ఆయన వర్షం పడుతున్నప్పటికి ఆయన పెంచలకోన దేవస్థానం ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి,పాపకన్ను మదుసూధన్ రెడ్డిలతో కలసి ఈ కార్యక్రమంలో పాల్గోని గ్రామలలోని ప్రతి గడపను సందర్శించి వారికి వైసిపి ప్రభుత్వం నాలుగు సంవత్సరాల పాలనలో ఎంత మేర అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాలు అందించినారో అన్న విషయాలను గణాంకాలుగా కరపత్రం అందజేసి వివరించారు, రాష్టాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికలలో ఆదరించి తిరిగి ముఖ్యమంత్రిగా చేయాలని ఆయన ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు చిగురుపాటి ప్రసన్న, గ్రామ సర్పంచ్ బక్కా బండమ్మ,యంపీటీసి కె. ప్రసన్న, వైసిపి నాయకులు నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి,జెసిఎస్ మండల కన్వీనర్ దందోలు లక్ష్మీనారాయణ రెడ్డి, వై.రమణా రెడ్డి,నోటి పరంధామి రెడ్డి,కోఆప్షన్ సయ్యద్,మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, కూకాటీ పెంచలయ్య, వివిద గ్రామాల సర్పంచ్‌లు,పలువురు యంపీటీసిలు, మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పల్లాప్రోలు మృతులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

**బుచ్చి జులై 25 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ఇస్కపాళెం మజరా పల్లాప్రోలు గ్రామంలో కలుషిత నీరు త్రాగి మృతి చెందిన 5 మందికి ప్రభుత్వం ఎక్ స్గ్రేషియా ఇవ్వాలని జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి గునుకుల కిషోర్ డిమాండ్ చేశారు. జనసేన నేతలతో కలిసి ఆయన పల్లాప్రోలు గ్రామాన్ని సందర్శించారు. డ్రైనేజిలో పైపులు ఉండడాన్ని గుర్తించిన ఆయన ఇది చాలా దారుణమని ఖండించారు. పూర్తి స్ధాయిలో ఇది ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. అధికారపార్టీ నేతలు, అధికారులు కండితుడుపు చర్యగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఒక్క నాయకుడుగాని, ఒక్క అధికారి గాని మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇప్పిస్తామని ప్రకటించకపోవడం దారుణమని ఖండించారు.కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పల్లాప్రోలు గ్రామం మీద వివక్షత చూపిస్తున్నారని అన్నారు. ఆయన ఎందుకు మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇప్పించకూడదని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి మృతుల కుటుంబాలకు ఎక్ స్గ్రేషియా ఇప్పించకపోతే ఆందోళన తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు.అలాగే గ్రామంలో డ్రైనేజిలో ఉన్న రక్షిత మంచినీటి పైపులు మార్చాలని మరో చోట వేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జిల్లా ఉపాధ్యాక్షులు సుధీర్ బద్దిపూడి, కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, హేమచంద్రయాదవ్, ఖలీల్, వరకుమార్, స్దానికులు గ్రామస్తులు నరసింహ తదితరులు పాల్గోన్నారు.



## మేకపాటి హయాంలో విమర్శలు తప్ప అభివృద్ధి శూన్యం

**వింజమూరు, జులై 25ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గ వైసిపి నాయకులు మేకపాటి కుటుంబీకులు వారి పాలనలో ప్రతిపక్షాలను విమర్శించడం తప్ప ఈ ప్రాంత అభివృద్ధి చేసింది శూన్యమని వింజమూరు టిడిపి కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి పేర్కొన్నా రు. మంగళవారం వింజమూరులోని రఘునాధరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేకపాటి వంశస్తులు 40సంవత్సరాలుగా రాజకీయంలో అనేక పదవులు చేపట్టారని ప్రతి చిన్న విషయంలో తెలుగుదేశంపార్టీని ,మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావును విమర్శించడం తప్ప వారు చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఇటీవల మండలంలోని కాటేపల్లి పంచాయతీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పర్యటిస్తే ఆయన వెంట పదిమంది కూడా జనం లేరన్నారు. పంచాయతీ పరిధిలో 2400 ఓట్లు కలిగిన పంచాయతీలో అక్కడ ప్రజలు అడిగిన ప్రశ్నలకు దాటవేత సమాధానం చెబుతూ ముందుకు వెళ్ళారే తప్ప సమస్యలను పరిష్కరించలేదన్నారు. అమరావతిలో చేపట్టిన పేదలందరికీ ఇళ్ళు శంఖుస్థాపన కార్యక్రమంలో పార్టీ మంత్రి జోగి రమేష్ మాట్లాడిన మాటలు వింటే సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. జోగి స్థాయి మరచి 40ఏళ్ళ రాజకీయ జీవితంలో 14ఏళ్ళు ముఖ్యమంత్రిగా, 15సంవత్సరాలు ప్రతిపక్షనాయకుడిగా ఉన్న చంద్రబాబును నోటికి వచ్చినట్లు మాట్లాడడం , జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను దారుణంగా మాట్లాడడం దాన్ని చూసి ముఖ్యమంత్రి సభలో నవ్వులు పులకించడం జోగిని చూసి భుజం తట్టడం చూస్తే ముఖ్యమంత్రి ఎంత దిగజారి రాజకీయాలు చేస్తున్నారో అర్థమవుతుందన్నారు. గత ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ గెలవనప్పటికీ 25లక్షల ఓట్లు సాధించిన నాయకుడన్నారు. టిడిపి 2కోట్లకు పైగా ఓట్లు వచ్చిన విషయం మర్చిపోరాదన్నారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని నేతలు హుందాగా విమర్శించడం నేర్చుకోవాలన్నారు. స్థాయి మరచి జోగి నీచంగా మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వింజమూరులో ఓటర్ల జాబితా పరిశీలనలో దొంగ ఓట్లు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈనెల 21నుండి ఆగస్ట్ 21వ తేది వరకు ఓటరు జాబితా సవరణ జరుగుతున్న నేపథ్యంలో టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్లు బిఎల్‌ఒలతో కలసి ఇంటింటికి తిరిగి ఓటరు జాబితాలోని తప్పిదాలను గుర్తించాలన్నారు. ఒక్కో వార్డులో 0నెంబర్లతో 150ఓట్లు ఉన్నట్లు తెలుస్తుందన్నారు. కావున టిడిపి బూత్‌కన్వీనర్లు టిడిపి సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తే వెంటనే తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్ళాలన్నారు. అధికారపార్టీ రానున్న ఎన్నికల్లో గెలిచేందుకు సకల ప్రయత్నాలు చేస్తుందని వారి ప్రయత్నాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు దంతులూరి వెంకటేశ్వరరావ్, చల్లా వెంకటేశ్వర్లు, యన్నం రామచంద్రారెడ్డి , కోడూరు నాగిరెడ్డి, ఏగినేని శ్రీనివాసులునాయుడు, గురజాల వాసునాయుడు, కొండపల్లి వెంకటేశ్వర్లు, షేక్ మహబూబ్‌బాషా, ఎన్.జయలక్ష్మి, ఆరికొండ శ్రీనివాసులు , పాములపాటి మాల్యాద్రి, బాదుల్లా, వివిధ పంచాయతీ ల టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## ఎపిబిఎస్‌ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి

**వింజమూరు, జులై 25ప్రభాతవార్త:** కర్నూల్లో ఆదివారం జరిగిన ఎపి బిఎస్‌ఎస్ఎస్ రాష్ట్ర స్థాయి సమావేశంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్, వెల్లాల మధుసూధన్‌శర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వింజమూరు పురోహితులు పసుపులేటి శివశంకర్‌ను రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ సమైక్యతకు, జాతికి మంచి పేరు తెచ్చేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పదవిని ఇచ్చిన అధ్యక్ష, కార్యదర్శులకు , తన వెంట ఉన్న కొల్లూరు రవి, మామిళ్ళపల్లి అయ్యప్పశర్మ , నెల్లూరుజిల్లా బ్రాహ్మణ సమైక్య సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



## జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

**ఉదయగిరి జులై 25 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలోని బిట్-2 సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఉదయగిరి జడ్‌పిటిసి మోడి రామాంజనేయులు ముఖ్య అతిధిగా పాల్గోన్నారు. ఇంచార్జి ఎంపిడిఒ మల్లికార్జున అధ్యక్షత వహించిన ఈకార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు మోడి రామాజనేయులు మాట్లాడుతు జగనన్న సురక్ష పథకం ఎంతో మందికి 11 రకాల ఉచిత సేవలను అందించందని వాటి వల్ల లబ్దిదారులు తమతమ పనులను సులభంగా నెరవేర్చుకునే అవకాశం కలిగిందని వారు తెలిపారు. రాబోయే రోజులలో జగన్‌మోహన్‌రెడ్డిని మరోకసారి ముఖ్యమంత్రిగా చేసుకుంటే ప్రజలకు సుపరిపాలన అందుతుందని వారు తెలిపారు.ఈకార క్రమంలో వైస్ ప్రెసిడెంట్ ముత్తుజా, పంచాయితీ సెక్రటరీ నరసయ్య, సచివాలయ సిబ్బంది,వాలింటరీలు తదితరులు పాల్గోన్నారు.



## ప్రజావసరాలు తీర్చేందుకే జగనన్న సురక్ష

**వింజమూరు, జులై 25ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ప్రజల అవసరాలను తీర్చేందుకేనని సర్పంచ్ నల్లగొండ్ల సృజన పేర్కొన్నారు. మంగళవారం వింజమూరు పంచాయతీ పరిధిలోని 4వ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష పథకంలో ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో మేలుగా ఉంటుందని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన 11రకాల ధృవపత్రాలను పైసా ఖర్చు లేకుండా పొందవచ్చన్నారు. ఈకార్యక్రమంలో 797మందికి వివిధరకాల ధృవపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ చొప్పా రవీంద్రబాబు, ఎంపిడిఒ రాజేష్‌బాబు, ఎంఇఒ సి.హెచ్.మధుసూధన్‌రెడ్డి, మండల వైసిపి కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి, సచివాలయ సిబ్బంది , వాలంటీర్లు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.



## జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఉచితంగా ధృవీకరణ పత్రాలు

**గుండవోలు(రాపూరు), జులై 25ప్రభాతవార్త** జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాలైన ధృవీకరణ పత్రాలను ఉచితంగా అందిస్తున్నట్లు మండల జెసిఎస్ కన్వీనర్ దందోలు లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం గుండవోలు సచివాలయం పరిధిలోని ఏపూరు,గుండవోలు గ్రామాలకు సంబందించి జగనన్నసురక్ష కార్యక్రమం గుండవోలు సచివాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలోగుండవోలు గ్రామ సర్పంచ్ తంబులూరు పెంచలయ్య, ఏపూరు గ్రామ సర్పంచ్ ఇండ్లూరి అశ్వినీ తదితరులు పాల్గోని(ప్రజలకు జగనన్న సురక్ష ద్వారా మంజూరైన పలు రకాలైన ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యంపీడీఓ అప్పాజీ, వివిద శాఖల అధికారులు, నాయకులు సంజీవ రెడ్డి, సుబ్బారెడ్డి, విశ్వనాద్ రెడ్డి, బాలక్రిష్ణా రెడ్డి,గోపాల్ రెడ్డి, పెద్ద ఎత్తున ఏపూరు,గుండవోలు గ్రామాలకు చెందిన ప్రజలు,సచివాలయం సిబ్బంది, రెండు గ్రామాలవాలంటీర్లు పాల్గోన్నారు.



## రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలల బంద్ ఈ నెల 28న

**కావలి, జులై 25 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసి కార్పొరేట్‌కు కొమ్ము కాయడాన్ని నిరసిస్తూ ఈ నెల 28వ తేది రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలల బంద్‌కు పిలుపు ఇవ్వడం జరిగిందని ఎబివిపి నెల్లూరు జిల్లా కన్వీనర్ మల్లవరపు అశోక్‌రెడ్డి తెలిపారు. కావలి పట్టణ రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో మంగళవారం ఎబివిపి కావలి నగర శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బంద్‌కు సంబంధించిన గోడపత్రికను ఎబివిపి నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మల్లవరపు అశోక్‌రెడ్డి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా కార్పొరేట్‌కు ప్రభుత్వం కొమ్ముకాస్తుందని దుయ్యబట్టారు. ప్రభుత్వం వెంటనే జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఖాళీగా వున్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. నీట్, ఐఐటి, ఎంసెట్‌ని కూడా బోధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై, నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న వసతి గృహాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 28వ తేది రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జూనియర్ కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే సియం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎబివిపి భాగ్ కన్వీనర్ శ్రీనాథ్, నగర సహాయ కార్యదర్శి హరీష్, నవీన్‌నాయుడు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.




## ఉదయగిరి విద్యా సంస్థల బంద్ సక్సెస్

**ఉదయగిరి జులై 25 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలోని పలు పాఠశాలలో టిఎన్‌ఎస్‌ఎఫ్ నిర్వహించిన విద్యాసంస్థల బంద్ కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ అద యక్షులు శివకృష్ణా పాల్గోన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రవేటు,కార్పోరేట్ విద్యా సంస్థలలో పీజు పెంపుదలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించిన ఫీజులు మాత్రమే వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని బకాయిలు వెంటనే విడుదల చేయాలని,ప్రభుత్వ అనుమతులు లేని ప్రవేటు స్కూల్స్‌పైన చర్యలు తీసుకోవాలని,అమ్మఒడి పథకం ప్రతి విద్యార్ధికి అందజేయాలని వారు డిమాండ్ చేశారు.హాస్టల్ విద్యార్ధులకు,డిగ్రీ ,పీజి విద్యార్ధులకు పెరిగిన ధరలకు అణుగుణంగా స్కాలర్ షిప్ పెంచి విడుదల చేయాలని కోరారు. ఎస్‌సి,ఎస్‌టి, బిసి, పేద మైనార్టీ విద్యార్ధులు చదువుకునే ఎడెడ్ కళాశాలలకు,పాఠశాలలకు ప్రభుత్వ సహాయం కొనసాగిస్తు జీవో నెంబర్ 77ను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.పై సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు జల్సాయాదవ్,నవీన్, కొండరావు,రాంమోహన్,తదితరులు పాల్గోన్నారు.




## మత్స్యకారుల అభ్యున్నతికి పెద్దపీట వేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే

**కావలి, జులై 25 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ పాలనలో మత్స్యకారుల జీవితాల్లో వెలుగు నింపి వారి అభ్యున్నతికి పెద్దపీట వేయడం జరిగిందని తెలుగుదేశం పార్టీ మత్స్యకార రాష్ట్ర నేత, ఆప్కాబ్ మాజీ చైర్మన్ కొండూరు పాల్‌శెట్టి, టిడిపి కావలి రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ తెలిపారు. కావలి టిడిపి కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తెలుగుదేశ ప్రభుత్వ పాలనలో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మత్స్యకారుల అభ్యున్నతికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. అలాగే చంద్రబాబునాయుడు పాలనలో మత్స్యకారులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో మత్స్యకారులకు ఒరగబెట్టిందేమి లేదని వారు తెలిపారు. నిన్నగాక మొన్న కావలి ఆర్‌ఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో వైసిపి నిర్వహించిన నియోజకవర్గ మత్స్యకారుల విస్తృత సమావేశంలో ప్రశ్నించిన మత్స్యకార నేతల్ని పోలీసుల ద్వారా బయటకు నెట్టించడం దారుణమన్నారు. ఈ సమావేశంలో వైసిపి పాలనలో మత్స్యకారులకు ఎటువంటి సంక్షేమం అందలేదని మత్స్యకార నేతలు ప్రశ్నించడం నేరమా అని వారు ప్రశ్నించారు. మత్స్యకారులను అవమానించడం వైసిపి నేతలకే దక్కిందని ఎద్దేవ చేశారు. కావలి నియోజకవర్గంలో తెలుగుదేశ ప్రభుత్వ పాలనలో మత్స్యకారులకు వలలు, ఇంజన్లు, బోట్లు, స్కూటర్లు, ఐస్‌బాక్సులు తదితర పరికరాలు అందించారన్నారు. కావలి నియోజవర్గంలో తీర ప్రాంత మత్స్యకారుల అభ్యున్నతికి పెద్దపీట వేయడం అందుకు నిదర్శనం ప్రస్తుత రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావేనని తెలిపారు.టిడిపి నేతగా,ఎమ్మెల్యేగా బీద మస్తాన్‌రావు ఆధ్వర్యంలో ఆనాటి జిల్లా కలెక్టర్ ముత్యాలరావు సహకారంతో వెయ్యి ఎకరాల పైబడి సాగుకు అనుమతులు ఇచ్చారన్నారు. టిడిపి పాలనలో పక్కా గృహాలు నిర్మించారన్నారు. ఈ అభివృద్ధికి సాక్షి ప్రస్తుత రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు అన్నారు. రానున్న ఎన్నికలలో మత్స్యకారలందరం తెలుగుదేశం పార్టీని గెలిపించుకుంటామన్నారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కావాలంటే తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టాలన్నారు. టిడిపి అధినేతలు నారా చంద్రబాబునాయుడు, లోకేష్‌బాబులు బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామన్నారు. ఈ చట్టం మత్స్యకారులకు కూడా వర్తిస్తుందన్నారు.టిడిపి పాలనలో మంజూరైన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మత్స్యకారుల జీవన ప్రమాణాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చర్యలు చేపడతామని నారా లోకేష్‌బాబు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా మత్స్యకార విభాగ అధ్యక్షులు పామంజి శేషయ్య, రాష్ట్ర మత్స్యకార సాధికార సమితి సభ్యులు సోమయ్యగారి రమణ, మత్స్యకార నేతలు వాయిల మస్తాన్, కుర్రు కొండయ్య, యల్లంగారి తాతయ్య, వాయిల తిరుపతి, మామిడి వెంకట రమణయ్య, పామంజి గోవిందయ్య, అప్పాడి తిరుపతి వెంకయ్య, ఆవుల యాకోబు, వాయిల కనకయ్య, యల్లంగారి ప్రసాద్, వాయిల ఏడుకొండలు తదితరులు పాల్గొని మాట్లాడారు.



## మలిరెడ్డిని వరించిన సొసైటీ ఛైర్మెన్ గిరి

**వింజమూరు, జులై 25ప్రభాతవార్త:** వింజమూరు ప్రాధమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్ష పదవికి వైసిపి మాజీ కన్వీనర్ మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డిపేరును ఉదయగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రకటించారు . మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి పేరును వింజమూరు నేతల సమక్షంలో ప్రకటించారు.కొద్దిరోజులుగా సొసైటీ ఛైర్మెన్ పదవిపై దోబూచులు జరుగుతున్న సమయంలో స్థానిక జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి పట్టుబట్టి మలిరెడ్డికే పదవి వచ్చేలా మేకపాటితో తీవ్ర చర్చలు జరిపారు. మంగళవారం పదుల సంఖ్యలో వాహనాల్లో వివిధ పంచాయతీల నుండి వైసిపి నేతలను గణపం బ్రాహ్మణపల్లికి తీసుకెళ్ళి తన క్యాడర్ సత్తా చాటాడు. సొసైటీ అధ్యక్ష పదవికి గతంలో పోటీచేసి ఓటమి చవిచూసిన మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డికి ఇవ్వాలని గతంలోనే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి వద్ద పేరును ప్రతిపాదించారు. అయినా అప్పటి పరిస్థితుల దృష్ట్యా మలిరెడ్డిని సొసైటీ వరించలేకపోయింది. మేకపాటి సస్పెండ్ అయిన వెంటనే గణపం చకచకా పావులుకదిపి తన అనుచర వర్గానికి మరళా పూర్వ వైభవం పార్టీలో కలిగేలా రాజకీయ పావులు కదిపారు. ఈక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య చైర్మెన్ పదవిపట్ల మలిరెడ్డిని ప్రకటిస్తే పార్టీ బలోపేతానికి బాగుంటుందని రాజారెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పేరును ప్రకటించేంతవరకు పట్టుబట్టారు. దాంతో రాజారెడ్డి మాజీ ఎంపి రాజమోహన్‌రెడ్డికి తీసుకెళ్ళి ఎట్టకేలకు మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డిని ఛైర్మెన్ పదవికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలియజేయడంతో గణపం వర్గీయులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పదవిని అప్పగించారని తనకు ఇచ్చిన పదవికి వన్నె తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. తనపేరును ప్రతిపాదించిన స్థానిక వైసిపి నేతలు గణపం బాలకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆనంగిరమణయ్యకు , అన్ని పంచాయతీల వైసిపి నేతలకు , తన సహచర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతికుటుంబానికి మేలు - ముఖ్యమంత్రిని ఆశీర్వదించండి



***వలేటివారిపాలెం జులై 25, ప్రభాతవార్త*** ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంలో మేలు చేకూరిందని స్ధానిక ఎంపీపీ పి.మౌనిక,జెడ్పీటీసీ ఇంటూరి భారతిలు అన్నారు.ఈ నేపద్యంలో రానున్న ఎన్నికల్లో ఆయనను ఆశీర్వదించాలని వారు సూచించారు. మంగళవారం పోకూరులో ఎంపీడీవో రఫీక్ అహ్మద్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ మౌనిక,జెడ్పీటీసీ భారతి,తహసిల్దార్ కెవిబిటి.సుందరమ్మ,సర్పంచ్ పర్రె కనకరత్నం వైసీపీమీడియా ప్రతినిధి పరిటాల వీరాస్వామి,జేసీఎస్ కన్వీనర్ అనుమోలు వెంకటేశ్వర్లు, ఇంటూరి హరిబాబులు పాల్గొన్నారు.తొలుత ఎంపీడీవో, తహసిల్దార్‌లు మాట్లాడుతూ జగనన్న కార్యక్రమంలో అందించు ప్రయోజనాలను వివరించారు.సభాప్రాంగణంలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు.సభానంతర పలువురు లబ్దిదారులకు పలు ధృవపత్రాలను అందచేశారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు జగదీష్, డీలర్ మాల్యాద్రి, చెన్నయ్యలతోపాటు సచివాలయ సిబ్బంది, గృహసారదులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## మెట్టప్రాంత అభివృద్ధికి సహకరించండి

**వింజమూరు, జులై 25 ప్రభాతవార్త:** జిలా ్లలోని అత్యంత వెనుకబడిన ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి బిజెపి తరపున చొరవ చూపాలని ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి వెంకటరంగారావు బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరిని కోరారు. మంగళవారం గుంటూరులో జరిగిన కోస్తా జోనల్ సమావేశంలో కదిరి రంగారావ్ అధ్యక్షురాలిని కలిసి ఈప్రాంత సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్ళారు. తాగు, సాగునీటి సమస్యతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేయాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 2024ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేస్తుందని కదిరి ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లాకిసాన్‌మోర్చా అధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు, రాష్ట్ర కిసాన్‌మోర్చా కార్యదర్శి కంచర్ల మురళి , జిల్లా కార్యవర్గ సభ్యుడు లెక్కమనేని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## వైసిపి అవినీతిని ప్రశ్నిస్తే సోమిరెడ్డి ఓటమి అంటు దాటవేత



**పొదలకూరు జులై 25 ప్రభాతవార్త:** మాజీ మంత్రి తెలుగుదేశం పొలిట్ బ్యూరో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రస్తుత వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డికి వైసిపి పార్టీకి అవినీతి గురించి అధికార్లు నిర్లక్ష్యం గురించి కక్ష కట్టి వేదిస్తున్న తీరు గురించి పలు ప్రశ్నలు సందిస్తే సమాధానం చెప్పలేని కాకాణి సోమిరెడ్డి వరుసగా ఓటమి అంటు అవహేళన చేస్తు వికృతానందం పొందుతున్నారని పొదలకూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తలచిరు మస్తాన్‌బాబు పొదలకూరు వైసిపి నాయకులపై తీవ్ర స్దాయిలోమండిపడ్డారు. పొదలకూరు పట్టణంలో గత రెండు రోజుల క్రితం మాజీ మంత్రి సోమిరెడ్డి విలేఖర్ల సమావేశం నిర్వహించి నేరుగా కాకాణిని వైసిపి పార్టీని అవినీతి గురించి ప్రస్తావిస్తే సమాధానం చెప్పలేని పరిస్దితులలో వైసిపి పార్టీ దాటవేస్తుందని అందుకు తార్కాణం వైసిపినాయకులు వ్యక్తిగతంగా ఓటమి గురించి మాట్లాడుతు పైశాచిక ఆనందం పొందుతున్నారని అన్నారు.ప్రజా నాయకుడికి సేవకుడికి పదవులు గెలుపులతో పనిలేదని ప్రజా పక్షాన నిలబడి సమస్యలపై పోరాడడమే లక్ష్యమని అందుకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎల్లవేళలా ముందుంటారని అన్నారు.పొదలకూరు పట్టణ ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతు ఖబడ్దార్ అంటు మా నాయకుడి పట్ల విచక్షణ కోల్పోయి మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. అదే నాయకుడ్ని మేము నేరుగా ప్రశ్నిస్తున్నామని పట్టణంలో ఏ రోజు అయినా టిడిపిపై వైసిపికి పది ఓట్లు వచ్చాయా మీరా మానాయకుడ్ని విమర్శించేదని ఆయన ప్రశ్నించారు. మరో మూడు నెలలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించడానికి అధికారం చేపట్టడానికి సమయం ఆసన్నమైందని దీని గుర్తు పట్టుకోవాలని రానున్న ఎన్నికలలో జయాపజాయాలు చూసుకుం దామని ఆయన సవాల్ విసిరారు.ఈకార య్రక్రమంలో తెలుగుదేశం నాయకులు వద్దులూరు మల్లికా ర్జునాయు డు,బాస్కర్‌రెడ్డి, కృష్ణా, కండే సురేష్,ఆదాల సుగుణమ్మ,కొంగి మస్తానమ్మ,ఆదాల మురళీ,కొంగి రమణ య్య, రామజోగినాయుడు, టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్దలు బంద్

**పొదలకూరు జులై 25 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా టిఎన్‌ఎస్‌ఎఫ్ చేపట్టిన విద్యా సంస్దల బంద్‌లో భాగంగా పొదలకూరు మండలంలో తిరుపతి పార్లమెంటరీ టిఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షులు కలగట్ల సందీప్ ఆద్వర్యంలో విద్యా సంస్దల బంద్‌ను విజయవంతంగా నిర్వహించారు. తొలుత పట్టణంలోని పాఠశాల,ఉన్నత పాఠశాలలు కు వెళ్లి విద్యార్దులకు బంద్ లక్ష్యాన్ని తెలియజెప్పి బంద్‌కు సహకరించమని తరగతి గదులనుండి విద్యార్దులను పంపించి వేశారు. అనంతరం జూనియర్ కళాశాలకు వెళ్లి విద్యార్దులతో కలిసి విద్యా సంస్దల బంద్ నిర్వహించారు.ఈ సందర్బంగా సందీప్ మాట్లాడుతు ప్రస్తుతం ఈ ప్రభుత్వానికి విద్యార్దుల అవస్దలు కష్టాల గురించి పలు మార్లు విన్నవించామని ఏ మాత్రం చెలించని ప్రభుత్వానికి చెలనం కోసం ఈ బంద్ నిర్వహించామని అన్నారు. అద్దె భవనాలలో నడుపుతున్న సంక్షేమ హాస్టల్స్‌కి సొంత భవనాలు సమకూర్చాలని అనుమతి లేని ప్రవేటు కార్పోరేటు విద్యా సంస్దలపై చర్య తీసుకోవాలని ప్రవేటు,కార్పోరేటు విద్యా సంస్దలలో పీజులపెంపుపై తక్షణం చర్యలు చేపట్టాలని నిర్దేశించిన పీజులు మాత్రమే వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ పొదలకూరు మండలాద్యక్షులు కాకులూరు నారాయణ,గాజుల విజయ్,శివ, అక్కి,నాని, వెంకటాద్రి, టిఎన్‌ఎస్‌ఎఫ్ కార్యకర్తలు పాల్గోన్నారు.



## టిడిపి జిల్లా నేత మన్నవకు సతీవియోగం

**కావలి, జులై 25 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు మన్నవ రవిచంద్ర సతీమణి విజయకుమారి (61) మంగళవారం కావలిలో మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు జనతాపేటలోని నవాబు బిల్డింగ్ సమీపంలోని మన్నవ సొంత నివాసంలో బుధవారం జరుగుతాయని బంధువులు తెలిపారు. టిడిపి సీనియర్ నేత మన్నవ సతీమణి మరణంతో పలు రంగాల్లోని ప్రముఖులు, టిడిపి నేతలు సంతాపం వ్యక్తం చేశారు. మన్నవను పరామర్శించారు.



## మన్నవ సతీమణి మృతదేహంపై పూలమాల వుంచి నివాళులర్పించిన డాక్టర్ నాయుడు

**కావలి, జులై 25 ప్రభాతవార్త:** టిడిపి సీనియర్ నేత మన్నవ రవిచంద్ర సతీమణి విజయకుమారి మృతి చెందడంతో కావలి మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ సర్జన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు మన్నవ నివాసానికి మంగళవారం వెళ్లారు. ఆమె మృతదేహంపై పూలమాల వుంచి నివాళులర్పించారు. రవిచంద్రను పరామర్శించారు. కావలి మాజీ ఎయంసి చైర్మన్, సీనియర్ టిడిపి నేత మలిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి నేతలు మన్నవ నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. మన్నవను పరామర్శించి ఓదార్చారు.



## పాఠశాలను సందర్శించిన ఎస్సీఇఆర్‌జి డైరెక్టర్

**మర్రిపాడు, జులై 25ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర విద్యా పరిశోధ నా సంస్థ డైరెక్టర్ రవీం ద్రనాథ్‌రెడ్డి మంగళవారం నంద వరం మోడల్‌స్కూల్‌ను సందర్శిం ారు. ఈసందర్భంగా జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాల పంపిణీ వివరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నించి వారిలో సామర్థ్యాలను పరిక్షించారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు,సలహాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు, ఉపాధ్యా యేతర సిబ్బంది పాల్గొన్నారు.



## జగనన్న సురక్షకు విశేష స్పందన

**సంగం జులై 25 ప్రభాతవార్త:** జగనన్న సురక్ష కార్యక్రమం అద్భుతమైన కార్యక్రమం అని ఎంపిడిఒ గోపి తెలిపారు.సంగం మండలం జెండాదిబ్బ గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. ప్రజలు వారికి అవసరమైన సర్టిఫికేట్లు తీసుకుంటాన్నారని ఆయన తెలిపారు. అలాగే సమస్యలు కూడా పరిష్కారం అవుతున్నాయని చెప్పారు.జెండాదిబ్బ గ్రామంలో 1493 సర్టిఫికట్లు ప్రజలకు అందజేయడం జరిగిందని అన్నారు. 11 రకాల సర్టిఫికేట్లు ఉచితంగా ఇవ్వడం జరిగిందని చెప్పారు. అనంతరం తహసిల్దారు వై నాగరాజు మాట్లాడుతు జగనన్న సురక్ష సర్వేలో ప్రజల సమస్యలు తెలుసుకొని వారికి వెంటనే సర్టిఫికేట్లు ఇవ్వడంతో వారికి ఫెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరకంబాకం పద్మమ్మ, ఉపసర్పంచ్ గుర్రం నరేష్ , మండల కో ఆప్షన్ మెంబర్ మన్సూర్,ఎంపిటిసి సభ్యులు పేరం వెంకటసుబ్బారెడ్డి, సచివాలయాల కన్వీనర్లు కరకంబాకం శంకరయ్య, సయ్యద్‌బాబు, మేడేపల్లి నరసింహులు, పంచాయితీ సెక్రటరీ షేక్ నాయబ్, పంచాయితీరాజ్ ఏఇ నదీమ్, ట్రాన్స్‌కో లైన్‌మెన్ శ్రీను, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, సచివాలయం సిబ్బంది,వాలింటరీలు పాల్గోన్నారు.



## మణిపూర్ క్రైస్తవులపై జరుగుతున్న అఘాత్యాలు ఖండించాలి

**కావలి, జులై 25 ప్రభాతవార్త:** మణిపూర్ క్రైస్తవులపై జరుగుతున్న ఘోర అఘాత్యాలను ఖండించాలని క్రైస్తవులు డిమాండ్ చేశారు. మంగళవారం కావలి జాతీయ రహదారిపై సత్యవేదాంత కళాశాల ఆధ్వర్యంలో క్రిస్టియన్లు జాతీయ జెండాను ప్రదర్శిస్తూ మణిపూర్ సంఘటనను నిరసిస్తూ నినాదాల ప్రదర్శన నిర్వహించారు.

## రైల్వే హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం



**బిట్రగుంట, జులై 25 ప్రభాతవార్త:** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే హాస్పిటల్ నందు మంగవారం ఒంగోలుకు చెందిన రమేష్ హాస్పిటల్స్ సహకారంతో రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని రైల్వే అడిషినల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి కొంతసమయాన్ని వినియోగించి వ్యాధులు తీవ్రతరం కాకముందే నివారణకు మందులు వాడాలన్నారు. బిట్రగుంట రైల్వే ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుధాకర్ సహకారంతో రమేష్ ఆసుపత్రికి చెందిన నెఫ్రాలజీ, ఆర్థోపెడిక్ తదితర వ్యాధులకు చెందిన వైద్యులు శివకుమార్, ధీరజ్, ఐ.వెంకటేశ్వరరెడ్డి, యం.డి.జహంగీర్ సుల్తాన్, శ్యామ్‌సుందరి, ఫిరోజ్‌తో పాటు డెంటల్ డాక్టర్ గణేష్‌కుమార్‌లు పాల్గొని రైల్వే ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యత పెంచండి



**బిట్రగుంట, జులై 25ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల బరువుకు తగ్గట్టు నాణ్యమైన పోషకాహారం అందించాలని కావలి సిడిపివో శారద ఆదేశించారు. ఎంపిడివో కార్యాలయంలో మంగళవారం ఎఎన్‌యంలు, మహిళా పోలీసులతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్రాలు తనిఖీ చేసినప్పుడు వయసు వారీగా పిల్లలను తూకం వేసి నిర్దేశించిన ప్రకారం పోషకాహారం అందుతుందా లేదా అని పర్యవేక్షించాలన్నారు. ఎంపిడివో వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రతి ఒక్కరికి అందించాలని, పుట్టిన బిడ్డ నుండి 6 సంవత్సరాల పిల్లలకు ధృవీకరణ పత్రం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కోటేశ్వరి, ఎఎన్‌యంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## బుచ్చిలో విద్యాసంస్థల బంద్



**బుచ్చి జులై 25 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెంలో టిఎన్ఎస్ఎఫ్ ఆద్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేఖ విద్యానాలకు నిరసనగా అన్ని ప్రభుత్వం, ప్రవేటు విద్యా సంస్థలను తెలుగునాడు స్టూడెంట్స్ పెడరేషన్ నాయకులు మూయించారు. ఈ సందర్భంగా టిఎన్ఎఫ్ మండలాద్యక్షులు కోప్పోలు మహేష్ మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగంపై చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా బిసి, ఎస్, ఎస్‌టి మైనార్టీల సంక్షేమ హాస్టల్స్ మౌళిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలలో టీచర్ పోస్టులు భర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియ నిలుపుదల చేయాలని, కార్పోరేట్ విద్యా సంస్థల పీజుల దోపిడిని అరికట్టాలని అన్నారు. డిగ్రి విద్య 4 సంవత్సరాలు రద్దు చేసి 3 సంవత్సరాలుగా కొనసాగించాలని వారు కోరారు. జీవో నెంబర్ 77 రద్దు చేయాలని, జూనియర్ కళాశాల విద్యార్ధులకు మధ్యహ్న బోజనం యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఈ డిమాండ్లు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో హేమంత్, దేవ, షాన్‌వాజ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు



**వరికుంటపాడు, జులై 25, ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని మండల పరిషత్ అధ్యక్షురాలు గవదకట్ల వెంకట లక్ష్మమ్మ అన్నారు. వేంపాడు సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. అనేక సంక్షేమ పథకాలతో విద్య, వైద్యం కు పెద్ద పీట వేస్తూన్నారన్నారు. జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఉన్న సమస్యలకు వెంటనే పరిష్కారం చూపారన్నారుఈ కార్యక్రమములో మండల కోఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ భాష మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష ద్వారా ప్రజల వద్ద కే అధికారులను పంపించి, సమస్యలను తెలుసుకొని, వాటినీ అక్కడే పరిష్కరిస్తున్నారన్నారు. అనంతరం 527 మంది లబ్దిదారులకు వివిధ రకాల ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమములో తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపిడిఓ కార్యాలయ ఏఓ వేణుగోపాల్ రావు, సర్పంచ్ తాతపూడి విజయమ్మ, ఉపసర్పంచ్ నరేష్ వైకాపా నేతలు గవదకట్ల మల్లికార్జున, అబ్బులామ్, ఆవులయ్య, మహేంద్ర, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, విఆర్ఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల బంద్ ప్రశాంతం



**వరికుంటపాడు, జులై 19, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలు మంగళవారం చేపట్టిన రాష్ట్ర బంద్ లో భాగంగా వరికుంటపాడు మండలంలో విజయవంతం అయ్యింది. ఉదయం నుండే విద్యాసంస్థల వద్దకు టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు ఆరెకొండ వెంకటరత్నం ఆధ్వర్యంలో నేతలు పాఠశాలల వద్దకు వెళ్ళి శాంతియుతంగా పాఠశాలలకు వచ్చిన విద్యార్థులను బయటకు పంపించివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెజి నుండి పిజి వరకు విద్యాసంస్థల్లో విద్యార్థులకు అనేక సమస్యలు ఉన్నాయనీ వాటినీ వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో విద్యార్థి సంఘ నేతలు గోపి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరు-2 సచివాలయం పరిధిలో సర్టిఫికేట్లు పంపిణీ



**ఇందుకూరుపేట, జూలై 25, ప్రభాతవార్త :** మండలంలోని కొత్తూరుగ్రామ సచివాలయం-2 పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్వేలో భాగంగా వివిధ సర్వీసుల ద్వారా గ్రామ ప్రజలకు సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. జగనన్న సురక్ష సర్వే ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను ఇటు అధికారులు అటు నేతలు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, కోవూరు నియోజకవర్గ యువజన విభాగ కమిటీ సభ్యులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, తహశీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు, ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు వెంకురెడ్డి, తిరుపతి, రామచంద్రయ్య, నేతలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం



**కోవూరు జులై 25 ప్రభాతవార్త :** రాష్ట్రం ఆర్థిక లోటులో ఉన్నా మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను క్రమం తప్పకుండా నెరవేరుస్తూ పేదల సంక్షేమాభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని, ఇది పనిచేసే ప్రభుత్వమేనని, మాటలు చెప్పే ప్రభుత్వం కాదని ఆయన నిరూపించారని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్ బాబురెడ్డి తెలిపారు. కోవూరులోని గుమ్మలదిబ్బ నాల్గవ సచివాలయ ప్రాంగణంలో మంగళవారం జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం వైసీపీ పాలనలో అర్హత ఉంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో చేరుతున్నాయన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టి ప్రజల ముంగిటికే సంక్షేమ ఫలాలు అందజేసిన ఘనత కేవలం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గత ప్రభుత్వం చేసిన సంక్షేమ , అభివృద్ధి కార్యక్రమాలు .. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలే బేరూజీ వేసుకోవాలన్నారు. మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టకపోతే ప్రస్తుతం ప్రజలకు వస్తున్న సంక్షేమ ఫలాలు ఆగిపోతాయన్నారు. దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ ప్రకారం ఆడుతున్నాడని, వారి మాటలు ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే టీడీపీని ప్రజలు చీకొట్టారని, రానున్న ఎన్నికలు తెలుగుదేశం పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ గతంలో పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పంచాయతీ కార్యాలయంలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుత వైసీపీ పాలనలో వేకువజామునే తలుపు తట్టి మరీ వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలు నిరుపమానం అన్నారు. ఆ సమయంలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వైసీపీ నాయకులు, అధికారులు ప్రజల్లో ఉండి సేవలు అందిస్తే.. చంద్రబాబు నాయుడు, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, ఆ పార్టీల నాయకులు ఎక్కడా దాక్కున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ఏ పథకం ప్రవేశపెట్టినా అది ఒక చరిత్రే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రాజగోపాల్ ప్రసంగించారు. అనంతరం 11 రకాల ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరి, డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, మండల సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, వైసీపీ నేతలు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, జుబేర్‌బాషా, వెంకటరమణారెడ్డి, కృష్ణయ్య, ఉపసర్పంచ్ మైనుద్దీన్, సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

## 'నానో యూరియా'పై ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు సిటీ, జూలై 25, ప్రభాతవార్త :** ఇఫ్కో అభివృద్ధి చేసిన నానో యూరియా వినియోగ వివరాలపై రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర మంత్రిత్వ శాఖను ప్రశ్నించారు. నానో యూరియా ప్రయోజనాలు, ధర, డిమాండ్, సరఫరా తదితర వివరాలు తెలపాల్సిందిగా కోరారు. స్పందించిన కేంద్రమంత్రి భగవంత్ ఖుబా భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్), ఇఫ్కో నానో -యూరియా ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి ఎంపిక చేసిన 20 స్థానాల్లో ఎంచుకున్న పంటలలో ఫోలియర్(ద్రవ) స్ప్రేగా ఉపయోగించేందుకు ట్రయల్స్ నిర్వహించినట్లు తెలిపారు. సాంప్రదాయ యూరియాకు బదులుగా నానో- యూరియాను టాప్-డ్రెస్సింగ్ కోసం ఫోలియర్ స్ప్రేగా ఉపయోగించ్చని ఈ అధ్యయనం ద్వారా సూచించబడిందన్నారు. సాంప్రదాయ ఎరువుల వాడకంతో పోల్చితే 3-8 శాతం దిగుబడి ప్రయోజనం ఉంటుందన్నారు. నానో యూరియా ఆకులపై పిచికారి చేసినప్పుడు సులభంగా స్టోమాటా ద్వారా ప్రవేశిస్తుందని, ఇతర పంటలకు నత్రజని అవసరాన్ని తీరుస్తుందని తెలిపారు. ప్రత్యేక పరిమాణం, అధిక ఉపరితల వైశాల్యం, వాల్యూమ్ నిష్పత్తి కారణంగా పంట పోషకాలు అవసరాన్ని సమర్థవంతంగా పరిష్కరిస్తుందని ఫలితంగా మెరుగైన పెరుగుదల, పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. నానో యూరియా(లిక్విడ్) ధర రూ.225/500 మి.లీ ధర కలిగి ఉండటం, 45 కిలోల సంప్రదాయ యూరియా బ్యాగ్ ధర కంటే 16శాతం తక్కువకే లభ్యమవుతుందన్నారు. నానో యూరియా వినియోగంపై అవగాహన కలిగించేందుకు శిబిరాలు వెబినార్లు, నుక్కడ్ నాటకాలు, క్షేత్ర ప్రదర్శనలు, కిసాన్ సమ్మేళనాలు, ప్రాంతీయ భాషలలో సినిమాలు వంటి పలు విభిన్న కార్యక్రమాల ద్వారా ప్రచారం చేస్తున్నాయన్నారు. నానో యూరియాను, కంపెనీలు పీఎంకేఎస్‌కేల వద్ద కూడా అందుబాటులో ఉంచుతున్నారని తెలిపారు. నానో యూరియా, ఎరువుల శాఖ జారీ చేసిన నెలవారీ సరఫరా ప్రణాళికలో చేర్చబడిందన్నారు.

## పల్లెలకు ఆరోగ్యనీ సజీవనీ రధం



**కలిగిరి, జూలై 25, ప్రభాతవార్త;** ఉదయగిరి నియోజకవర్గంలోని మారు మూల పల్లెలకు సైతం ఆరోగ్యసంజీవనీ రథం పర్యటిస్తూ పేదప్రజలకు ఆరోగ్య సమస్యల్ని తీర్చడమేకాకుండా ప్రజలను ఆరోగ్యవంతులుగా చేయడంలో తమ పాత్ర పోషిస్తుంది. దీనితో పల్లెప్రజలు తమ గ్రామా నికి ఆరోగ్య చైతన్యరందం ఎప్పుడు వస్తుందాఅని ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో కాకర్ల ట్రస్ట్ అఅదినేత కాకర్ల సురేష్ ఏర్పాటు చేసి ఉచిత ఆరోగ్య సజీవినీ చైత్యరథం మంగళవారం కలిగిరి మండలంలోని క్రిష్టారెడ్డిపాళెంలో తమ సేవలను కొనసాగించింది. ఈ ఉచిత వైద్యశిభిరానికి ప్రజలు అత్యదికంగా పాల్గొని అన్నిరకాల పరీక్షలు చేయించుకొన్నారు. ఇందులో 130మంది వివిదరకాల పరీక్షలు చేయించుకొని ఉచితముగా మందులు అందజేయడా 98మంది కంటికి సంభందించిన పరీఓలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డబ్బుగుంట బుజ్జియ్య, గంగపట్లం కొండయ్య, సొలసారవి, తోకల కొండారెడ్డి, అంకయ్య, మహేంద్ర, పెండెం కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను పనికి కాదు.. బడికి పంపాలి



**కోవూరు జూలై 25 ప్రభాతవార్త :** బడిఈడు కలిగిన పిల్లలను పనులకు పంపకుండా వారిని తప్పనిసరిగా పాఠశాలలకు పంపించేలా తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంఈవో-2 చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరు మండలం ఎన్ఎస్ఆర్ కాలనీ ప్రాంతంలో మంగళవారం బడి ఈడు కలిగి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించాలంటే చదువే ప్రధానమని, దీనిని దృష్టిలో పెట్టుకుని తమ బిడ్డలను పాఠశాలలకు పంపించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం జగనన్న విద్యాకానుక పేరు మీద 8 రకాల వస్తువులను అందజేస్తుందని, అదేవిధంగా జగనన్న గోరుముద్ద పథకం ద్వారా బలవర్ధక పౌష్టికాహారాన్ని అందజేస్తుందని, వీటిని పూర్తిస్థాయిలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఇరువురు పిల్లలను జెబీఆర్ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకున్నారు.

## కోడూరు బీట్-1లో జగనన్న సురక్ష



**తోటపల్లిగూడూరు, జూలై 25, ప్రభాతవార్త:** మండలంలోని కోడూరు బీట్-1 సచివాలయం పరిధిలో మంగళవారం తహశీల్దార్ హమీద్, ఎంపీడీఓ హేమలత, ఈవోపీఆర్డీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. గ్రామంలో కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్ళడం జరిగిందని ఎంపీడీఓ తెలిపారు. అనంతరం స్థానిక వైకాపా నేత, కోడూరు దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ బీట్ -1 పరిధిలో సురక్ష సర్వే సచివాలయ వాలంటీర్లు, అధికారులు ఎంతో కష్టపడి సర్వే పూర్తి చేసి అవసరమైన వారికి సర్టిఫికేట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సంపూర్ణ సహకారంతో కోడూరు పంచాయతీలో అభివృద్ధి జరిగినట్లు వివరించారు. గృహనిర్మాణాల విషయంలో లబ్దిదారులను ప్రోత్సహించి తొందరగా పూర్తి చేసే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శేషమ్మ, కోడూరు బీట్ -1 పంచాయతీ సభ్యులు ఆగాల శ్రీనివాసులురెడ్డి, కోడూరు మాజీ పంచాయతీ సభ్యులు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, కంజి శ్రీరాములు, ఇసుకపాలెం ఎంపీటీసీ రాయపు శీనయ్య, హౌసింగ్ ఏఈ ముక్తార్ భాష, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



**కోవూరు జూలై 25ప్రభాతవార్త:** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన వారు తప్పక ఓటు నమోదు చేసుకోవాలనిడిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్ అన్నారు. కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామంలో జరుగుతున్న ఓటు సర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు ఈ కార్యక్రమం సందర్భంగా ఇంటికి వెళ్లినప్పుడు డోర్ నెంబర్ లేని పక్షంలో పక్క ఇంటికి ఏ డోర్ నెంబర్ ఉందో ఆ డోర్ నెంబర్ వేసి ఏ కానీ, బీ కానీ పెట్టేలా తీగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మృతిచెందిన వారి వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. ఒకే ఇంటికి సంబంధించిన ఓటర్లు ఒకే బూత్‌లో ఉండేలా బీఎల్‌వో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

## ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అబిదాసుల్తానా



**నెల్లూరు జూలై 25, ప్రభాతవార్త-వైద్యం:** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలను నెల్లూరు రూరల్ కార్యాలయంలో నెల్లూరు పార్లమెంటు తెలుగు దేశం పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు అబిదాసుల్తానా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛాన్ని అందించి సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆమెతో పాటు పఠాన్ సాబిర్‌ఖాన్, మన్నేపల్లి రఘు, పముజుల ప్రదీప్, కాకుపల్లి శివ, జాఫర్‌ఖాన్, మల్లిఖార్జున జలదంకి సుధాకర్, హఫీజ్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## గణితంలో మరింత మెళుకువలు విద్యార్థులకు అందించాలి



**కోవూరు జూలై 25 ప్రభాతవార్త:** గణితంలో వస్తున్న నూతన మెళుకువలపై విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని బుచ్చి మండల విద్యాశాఖ అధికారి దిలీప్ కుమార్ అన్నారు. కోవూరులోని జిల్లా పరిసత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో మంగళవారం కోవూరు, బుచ్చిరెడ్డిపాలెం మండలాలకు సంబంధించిన గణిత ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ప్రాథమిక దశ నుంచి విద్యార్థులకు కుత్యంతర బోధనపై అవగాహన కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గణితంలో వస్తున్న నూతన మెళుకువలు , పాఠ్యాంశాలపై ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అవగాహన చేసుకుని దానిని తరగతి గదుల్లో అమలు చేసేలా దృష్టి పెట్టాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కోవూరు మండల విద్యాశాఖ అధికారి రహీమ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తిలు పలు విషయాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

## పొదుపు గ్రూపు సభ్యులంతా అక్షరాస్యులు కావాలి



**కోవూరు జూలై 25 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని పొదుపు గ్రూపు సభ్యులంతా తప్పనిసరిగా అక్షరాస్యులుగా ఉండాలని, ఈ దిశగా వీవోఏలు వారిలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఏపీఎం వెంకటస్వామి తెలిపారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన వీవోఏలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా పొదుపు గ్రూపులు రుణాలు పొందే సమయంలో ఎవరికీ కూడా పొదుపు గ్రూపులు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గతంలో పొదుపు గ్రూపులు రోజూ తమ పొదుపును ఒక రూపాయితో ప్రారంభించారని, ప్రస్తుతం దానిని ఘననీయంగా పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా వారి ఆర్థిక పరిపుష్టి పెరుగుతుందన్నారు. అదేవిధంగా పొదుపు గ్రూపులు క్రమం తప్పకుండా పొదుపు సమావేశాలు ఏర్పాటు చేసుకుని రికార్డు నిర్వహణ పారదర్శకంగా చేపట్టాలన్నారు. అదేవిధంగా బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తే వారికి వడ్డీ మాఫీ వస్తుందన్నారు. ప్రస్తుతం పొదుపు గ్రూపులో ఉన్న సభ్యులు సూక్ష్మ సంస్థలపై పరుగులు తీస్తున్నారని, ఆయా గ్రామాలకు సంబంధించిన వీవోఏలు ఈ విషయంపై వారిలో అవగాహన కల్పించాలన్నారు. సంఘమిత్ర ద్వారా రుణాలు తీసుకుంటే రూపాయి వడ్డీ పడుతుందని, అదే సూక్ష్మ సంస్థల నుంచి రుణాలు తీసుకుంటే రెండు, నుంచి మూడు రూపాయల వరకు వడ్డీ పడుతుందనే విషయాన్ని పొదుపు గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించేలా దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షురాలు సుగుణమ్మ, కార్యదర్శి ధనమ్మ, సీసీలు రాజశేఖర్, రాము, శౌరీ, వసంత, తదితరులు ఉన్నారు.

## కన్వీనర్ ఆద్వర్యంలో సమన్వయకర్తను కలసిన నేతలు



**జలదంకి, జులై 25, ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గానకి ఇటీవల వై.సి.పి సమన్వయకర్తగ నియ మితులైన మేకపాటి రాజగోపాల రెడ్డిని జలదంకి మండల వై.సి.పి కన్వీనర్ చేవూరి జనార్ధనరెడ్డి ఆద్వ ర్యంలో మండళవారం గ్రామస్తాయి, మరియు మండల స్తాయి వివిధ విభాగా లకు చెందిన నేతలతో మర్రిపాడు మండలంబ్రాహ్మణపల్లిలో మర్యాదపూర్వకం కలిశారు. ఈసందర్బంగ జలదంకి మండలంలో వై.సి.పి నాయకత్వం పటిష్ఠంగవుందని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సమన్వయకర్తగ నియమితులైన మీకు అన్నివిదాలుగ అండదండలుగ వుంటామని ఈ సందర్బంగ ఆయన స్పష్టంచేశారు. దీంతో జలదంకి మండలంలో జనార్ధన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ పటిష్టంగ పనిచేయాలని సమన్వయకర్త రాజగోపాలరెడ్డి పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. కన్వీనర్‌వెంట పార్టీ జిల్లా ప్రచారకమిటి అధ్యక్షులు పాలవల్లి మాలకొండారెడ్డి, జలదంకి సొసైటి అధ్యక్షులు కేతిరెడ్డి రవిరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, మాజీ పి.ఎ.సి.ఎస్ చైర్మన్ గుర్రం జగ్గయ్యనాయుడు,

## సీజనల్ వ్యాధులపై పాడిరైతుల్లో అవగాహన పెంచాలి



**కోవూరు జూలై 25 ప్రభాతవార్త :** ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైన దృష్ట్యా ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై పాడి రైతుల్లో అవగాహన కల్పించేలా పశు వైద్యాధికారులు , పశు సమాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సి అవసరం ఉందని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ మౌర్య అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల సమావేశ మందిరంలో కోవూరు పశు సంవర్ధక శాఖ డివిజన్ పరిధిలోని కోవూరు, విడవలూరు మండలానికి సంబంధించిన పశు వైద్యులు, గోపాలమిత్రులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులు, గొర్రెలు, మేకల్లో గొంతు వాపు వ్యాధి, చిటుక వ్యాధి సోకుతుందని, దీనికి సంబంధించిన సకాలంలో ఇటువంటి వ్యాధులు రాకుండా టీకాలు వేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా మేలుజాతి పెయ్యదూడల పథకంపై పాడి రైతుల్లో అవగాహన కల్పించి పాల ఉతనపత్తిని ఘననీయంగా పెంచేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా కృత్రిమ గర్భోత్పత్తి, సెక్స్‌డ్ స్టార్టెడ్ సెమన్‌పై కూడా పాడి రైతులకు అవగాహన కల్పించి అంతరించిపోతున్న మేలుజాతి పశు సంపదను మరింత పెంచేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో పశు వైద్యాధికారి డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ వాణి శంకర్, డాక్టర్ షబానా, వెటర్నరీ ఏవో సజ్జాద్ పశు సహాయకులు పేరా సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి



**కోవూరు జూలై 25 ప్రభాతవార్త :** కోవూరు సబ్ ట్రెజరీ కార్యాలయ పరిధిలో ఇంకా 68 మంది పంఛనర్లు ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా ఖజానాధికారి డి. గంగాద్రి అన్నారు. కోవూరులోని ఉపఖజానా కార్యాలయంలో ఆయన పలు రికార్డు రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు సబ్ ట్రెజరీ పరిధిలోని డీడీవో కూడా తమకు సంబంధించిన డిసిప్లినరీ డేటాను సకాలంలో సబ్మిట్ చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపఖజానాధికారి కిరణ్‌కుమార్, ఉద్యోగులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ

**కోవూరు జూలై 25 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వమించారు. అనంతరం నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కోవూరు కాపువీధికి చెందిన నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, భక్తులు ఉన్నారు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



**బిట్రగుంట, జులై 25 ప్రభాతవార్త** రెవెన్యూ శాఖలో భూ సమస్యలకు శాశ్విత పరిష్కారం చూపడమే జగనన్న శాశ్విత భూ హక్కు, భూరక్ష కార్యక్రమ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ యం.హరినారాయణ్ పేర్కొన్నారు.బోగోలు మండల తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం జగనన్న శాశ్విత భూ హక్కు, భూరక్ష కార్యక్రమంలో భాగంగా చేపట్టిన రీసర్వే ప్రక్రియని ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ మండల పరిధిలో జక్కేపల్లిగూడూరు, ముంగమూరు గ్రామాలలో పక్కాగా భూ సర్వే జరుగుతుందని అందుకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. జిల్లాలో 118 గ్రామాలలో మొదటి విడత రీసర్వే పూర్తయిందని రెండో విడత 110 గ్రామాలు ఎంపిక చేయగా ఇప్పటికే 37 గ్రామాల్లో రీసర్వే పూర్తయినట్లు చెప్పారు. జిల్లా మొత్తం మీద సుమారు 700కు పైగా గ్రామాలలో సర్వే ప్రక్రియ ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్ధవంతంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. అనంతరం కోవూరుపల్లి ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు.ఈ సందర్బంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.అందులో భాగంగా ప్రతి పిహెచ్‌సి పరిధిలో ఇద్దరు డాక్టర్లను నియమించి 45 రకాల పరీక్షలు చేస్తూ అన్ని రకాల మందులు అందుబాటులో వుంచినట్లు చెప్పారు. చుట్టు ప్రక్కల గ్రామాలలో విషక్రిములు కాటాస్తే కోవూరుపల్లి పిహెచ్‌సిలో ఒక డాక్టర్ అందుబాటులో వుండే విధంగా చర్యలు తీసుకోవాలని జైభీమ్ అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షులు బత్తుల రవిచంద్ర కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కావలి ఆర్డీవో శీనానాయక్, డిప్యూటీ డియంఅండ్‌హెచ్‌వో బ్రిజిత, తహశీల్దార్ హేమంత్‌కుమార్, ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సీమాతబాసు, డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జలదంకి మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**జలదంకి,జులై25,ప్రభాతవార్తః** కలెక్టర్ మం.హరినారాయణన్ మంగళవారం జలదంకి మండలంలో పర్యటించారు.కావలి ఆర్.డి.ఒ సీనానాయక్‌తో కలసి కలెక్టర్ మండల పరిధిలోని చామదల పంచాయతీ ఆదిరెడ్డిపాళెంలో ఇంటింటవైద్యం ఫ్యామిలి డాక్టర్ విధానాన్ని పరిశీలించారు. ఈసందర్బంగ రోగులతో నేరుగా మాట్లాడారు. వైద్యపరీక్షలు అందిస్తున్న సేవలనుగూర్చిఅడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్రాహ్మణక్రాక పంచాయతి బి.కె అగ్రహార జువ్విచెట్టుపాళెం ఎస్.సి కాలని అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించి చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బరువుతక్కువగా, బలహీనంగ వున్న పిల్లలపట్ల ప్రత్యేకశ్రద్ద తీసుకోవాలని చిన్నపిల్లల వైద్యనిపుణుల వద్ద పరీక్షలుచేయిస్తు వారిని ఆరోగ్యంగ వుండేలా చూడాలని సూసించారు.అందిస్తున్న పాలు,గ్రుడ్లను పరిశీలించి కేంద్రం పరిధిలోని ప్రతి బిడ్డ క్రమం తప్పకుండ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.ఈసందర్బంగ కాలనీవాసులు తమ కాలనీకి లో నెలకొనివున్న స్మశానవాటికస్తలం,సి.సిరోడ్లు,డ్రైన్లు,వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.పరిశీలించిన ఆయన సానుకూలంగ స్పందించారు.తగు చర్యలు తీసుకోవాలని ఆర్.డి.ఒ,తహసిల్దార్‌కు సూచించారు.అనంతరం విలేఖర్లతో మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగ తీసుకొని గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువచేసే లక్ష్యంతో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని ప్రవేశపెట్టిందని అందరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.అలాగే అంగన్‌వాడీ సెంటర్‌ల్ల నిర్వహణ భేషుగ్గా వుందని మెచ్చుకున్నాడు.కలెక్టర్‌వెంట డిప్యూటి డి.ఎం.అండ్ హెచ్.ఒ బ్రిజిత,సి.డి.పి.ఒ పద్మజ, కావలి డి.ఎల్.డి.ఒ కనకదుర్గాభవాని, తహసిల్దార్ పద్మావతి,ఎం.పి.డి.ఒ శ్రీధర్,డాక్టర్ భవ్య,మండల వ్యవసాయాదికారిణి శైలజ,ఎ.పి.ఒ శ్రీధర్ తదితర అదికారులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి లబ్ధిదారులకు సంక్షేమం అందాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష




**కందుకూరు,జులై25,ప్రభాతవార్త** కందుకూరు మున్సిపాలిటి స్థానిక సచివాలయం ఐఎస్‌రావు నగర్‌లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాల ధృవపత్రాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.దీని వలన సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయని తెలిపారు.ప్రతి ఒక్కరూ ఈ క్యాంపును ఉపయోగించుకుని ధాంక్యూ జగనన్న మెసేజ్ తెలియజేయాలన్నారు.మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 30వ వార్డులో దాదాపు 3కోట్ల పనులను వేగవంతం గా జరుగుతున్నాయని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు ధృవపత్రాలు పంపిణీ చేశారు.అనంతరం ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో జెసిఎస్ కోఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్,మున్సిపల్ డిఈ రామూర్తి,ఆర్ఐ చంద్రశేఖర్,సచివాలయ కన్వీనర్లు రావులకొల్లు బ్రహ్మానందం,బక్కమంతుల అశోక్,జాజుల సాయిలక్ష్మి,జాజుల కోటేశ్వరరావు,కోడూరు వసంతరావు,గణేశం గంగిరెడ్డి,ఏకాంబరం విశ్వనాథ్,సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు,గృహసారధులు,పాల్గొన్నారు.

## నాడు-నేడు పనులను పరిశీలించిన కలెక్టర్



**అల్లూరు, జులై 25 ప్రభాతవార్త** అల్లూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో చేపట్టిన నాడు-నేడు పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలో మొదలైన రెండో విడత నాడు-నేడు పనులు వర్షాల కారణంగా త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు.బడిఈడు పిల్లలందరూ బడిలో వుండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. అనంతరం అల్లూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని గైనకాలజీ, సర్జికల్ తదితర విభాగాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో శీనానాయక్, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడివో శ్రీదేవి, ఎంఇవో రవీంద్రనాద్,ఇవోపిఆర్‌డి పెంచల వీరేంద్ర, ఆసుపత్రి సూపరింటెండెంట్ కట్టా వెంకటేశ్వర్లు, వైద్యులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష ద్వారా అర్హులందరికి సంక్షేమ ఫలాలు



**నెల్లూరు సిటీ, జూలై 25, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన జగనన్న సురక్ష పథకంతో అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందించడం సాధ్యమని, అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. రూరల్ నియోజకవర్గం పరిధిలోని 23వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కమీషనర్ పాల్గొని లబ్దిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి కమీషనర్, విజయ డెయిరి ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కేంద్రాలలో ఆధార్ అప్‌డేట్ సెంటర్, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సేవలను అందిస్తున్నామని తెలిపారు. సచివాలయ శిబిరాలలో ఏర్పాటు చేసిన స్పందన కౌంటర్, హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ డెస్క్‌ల ద్వారా అన్ని రకాల సేవలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా మొత్తం 11రకాల సేవలను అందిస్తున్నామని, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్లు (కుల, నివాస దృవీకరణ పత్రాలు), ఆదాయ దృవీకరణ పత్రం, జనన, మరణ దృవీకరణ పత్రాలు, ఆస్తి పన్ను పేరు మార్పు చేర్పులు వివాహ దృవీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబరు సర్టిఫికేట్లు, ఆధార్ కార్డులో విభజన వంటి సేవలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలోడిప్యూటీ కమీషనర్ చెన్నుడు, అదనపు కమీషనర్ శర్మద, టీపీఆర్‌ఓ ప్రసాద్, కార్పొరేట్లు మొయిళ్ళ గౌరీ, వైసీపీ నేతలు సురేష్‌రెడ్డి, పుల్లారెడ్డి, సచివాలయ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలపై అత్యాచారాలు చేయడం హేయం




**నెల్లూరు జూలై 25, ప్రభాతవార్త-వైద్యం** మణిపూర్‌లో క్రిస్టియన్‌కి చెందిన చర్చిలు, మిషనరీ ఆస్తులను, మహిళలపై అత్యాచారాలు చేయడం అత్యంత హేయమైన చర్యని తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో మణిపూర్‌లో క్రైస్తవ సోదరుల మీద జరుగుతున్న మారణకాండకు నిరసనగా క్రైస్తవ సోదరులు,ఆ కార్యకర్తలతో కలిసి నిరసన, ప్రదర్శన కార్యక్రమాన్ని శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కులాలు, మతాలు వేరైనా మనమంతా భారతీయులమని, భిన్నమతాలు, కులాలు, విభిన్న ప్రాంతాలు ఉన్న భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వంగా అందరం ఒకే కుటుంబంలాగా ముందుకు సాగే పరిస్థితన్నారు. ఇలాంటి సంఘటనలు కులాలు, మతాలు పేరుతో జగరటం దురదృష్టకరమని ఎమ్మెల్యే అన్నారు. ఇప్పటికే భారత ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, వేలాదిమంది సైన్యాన్ని, అస్సాం రైఫిల్స్‌ని మణిపూర్‌కి పంపించడం హర్షించదగ్గ విషయమని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వివరించారు. మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలు రాజకీయ ప్రయోజనాల కోసం వాడకుండా, మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేదానికి ఏ చర్యలు చేపట్టాలో ఆ చర్యలను నెలకొల్పేందుకు ప్రయత్నించాలని ప్రభుత్వాన్ని శ్రీధర్‌రెడ్డి కోరారు.

## ఘనంగా శ్రీగుర్రప్పస్వామి వార్షిక వేడుకలు



**వింజమూరు, జులై 25ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలో నడిమూరులో వేంచేసియున్న శ్రీగుర్రప్పస్వామి 12వ వార్షిక వేడుకలను గుర్రప్ప భక్తబృందం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం చేయించి స్వామివారిని సర్వాంగసుందరంగా సుంగధపరిమళ పుష్పమాలలతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పసుపులేటి శివశంకర్‌శర్మ కార్యక్రమాలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కోలాటం నిర్వహించారు . మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యంలో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను గడేసిన గురవారెడ్డి పర్యవేక్షించారు.

## గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే



**అల్లూరు, జులై 25 ప్రభాతవార్త** గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం అల్లూరు మండల పరిధిలోని బీరంగుంట గ్రామంలో పాల్గొన్నారు. బీరంగుంట గ్రామస్తులు గజమాలతో ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను బుక్‌లెట్‌ను అందజేసి పథకాలు అందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిందన్నారు. తెలుగుదేశం నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మవద్దన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వుండే జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీదేవి,ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, వైసిపి సీనియర్ నాయకులు నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, కోడూరు సాధక్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గుమ్మడి సురేంద్ర,బీరంగుంట వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు సచివాలయాలకు అనుసంధానం



**నెల్లూరు సిటీ, జులై 25, ప్రభాతవార్త** నెల్లూరు నగర నియోజకవర్గంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సచివాలయాలకు అనుసంధానం చేస్తున్నామని మాజీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. నెల్లూరు నగరంలోని 50వ డివిజన్ కొడూరువారివీధి, శ్రీనివాసపురం, మెట్లరేవు, తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం 139వ రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నామన్నారు. నగర నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజల భద్రతే ముఖ్యంగా మొదటి విడత కింద 1000 సీసీ కెమెరాలు అమర్చి సచివాలయాలకు అనుసంధానం చేయబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండి ఖలీల్, అహ్మద్, కార్పొరేటర్ గుంజి జయలక్ష్మి, ఏపీ అగ్రో డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరక్టర్ కొణిదల సుధీర్, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన ఎంపీ ఆదాల



**నెల్లూరు సిటీ, జూలై25,ప్రభాతవార్త** నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అమరావతిలో కలిశారు. నెల్లూరు రింగ్ రోడ్డుతో సహా పెండింగ్లో ఉన్న పలు సమస్యల గురించి ముఖ్యమంత్రితో చర్చించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాను ప్రస్తావించిన సమస్యల పట్ల సానుకూలంగా స్పందించారని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## అదనపు కార్మికులతో జగనన్న కాలనీల్లో పనులను వేగవంతం చేయండి



**నెల్లూరు కార్పొరేషన్, జూలై25,ప్రభాతవార్త** జగనన్న కాలనీలో లేఅవుట్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన మేరకు అదనపు కార్మికులను నియమించుకుని, నిర్మాణ పనుల్లో వారిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని హౌసింగ్ విభాగం అధికారులను నగరపాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. జగనన్న కాలనీల నిర్మాణ పనుల పురోగతిపై హౌసింగ్ విభాగం, ఏపీఎస్పీడీసీఎల్, ఇరిగేషన్, నగర పాలక సంస్థ అధికారులతో స్థానిక వెంకటేశ్వరపురంలోని లేఅవుట్‌ను కమీషనర్ మంగళవారం పరిశీలించారు. జగనన్న కాలనీ లేఅవుట్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర వసతులు కల్పించేందుకు అదనపు కార్మికులతో నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను కమీషనర్ ఆదేశించారను. వందశాతం నిర్మాణ పనులు పూర్తయిన గృహాలను వెంటనే లబ్దిదారులకు అందజేయాలని సూచించారు. రూఫ్ నిర్మాణం పూర్తయిన గృహాలకు పొదుపు పథకం ద్వారా వడ్డీ లేని రుణాన్ని అందించి, ఫినిషింగ్ పనులను పూర్తి చేయాలని, త్వరితగతిన గృహాలను లబ్దిదారులకు అప్పగించాలని కమీషనర్ సూచించారు. అదే విధంగా స్థానిక కాలనీ నిర్మాణ సమయం నుంచే ప్రజలకు అందుబాటులో ఉండేలా బస్సు రవాణా సౌకర్యం కల్పించాలని కమీషనర్ సూచించారు. విద్యుత్, వీధిదీపాలు, సీసీ కెమెరాలు, మంచినీరు, డ్రైన్లు, రోడ్డు మార్గాలు, పచ్చదనం వంటి మౌలిక సదుపాయాలను కల్పించి లబ్దిదారులకు గృహాలను కేటాయించనున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ఈఈలు, డీఈలు, ఏఈలు, విద్యుత్ అధికారులు, ఇరిగేషన్ విభాగం అధికారులు, నగర పాలక సంస్థ అధికారులు, సచివాలయం అమెనిటీస్ కార్యదర్శులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## సచివాలయాలను తనిఖీ చేసిన కమీషనర్ వికాస్ మర్మత్



**నెల్లూరు కార్పొరేషన్, జూలై25,ప్రభాతవార్త** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 36/3 ఫతేఖాన్ పేట 37/2 రామ్ నగర్-2 వార్డు సచివాలయాలను కమీషనర్ వికాస్ మర్మత్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల్లోని ఇన్‌స్పెక్షన్ రిజిష్టర్లు, నోటీసు బోర్డు, హాజరు రిజిష్టరు, స్పందన రిజిష్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాట్లను అన్ని సచివాలయాల్లో ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని, జగనన్న సురక్ష పథకం పారదర్శకంగా అందరికి చేరువయ్యేలా సచివాలయాల సెక్రటరీలు కృషి చేయాలని సూచించారు. సచివాలయాలలో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోగా పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని కార్యదర్శులకు సూచించారు. ఎస్‌డీజీ సర్వే, భూహక్కు, సర్వే, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సూచించిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని తెలిపారు. అదే విధంగా స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, నాడు-నేడు పనుల పురోగతి, ఆస్తి పన్ను, యూజర్ ఛార్జీల వసూళ్ళను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని, తమకు నిర్ధేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులోపు అందుకోవాలని సూచించారు. జగనన్న కాలనీ లేఅవుట్ల నిర్మాణం పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అమెనిటీస్ కార్యదర్శులను కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి



**నెల్లూరు క్రైమ్, జూలై25,ప్రభాతవార్త** నగరంలోని వేదాయపాలెం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ నెంబరు ఒకటి సమీపంలో సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెందాడని సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సబ్‌ఇన్‌స్పెక్టర్ హరిచందన్ మాట్లాడుతూ మృతదేహం ఉన్న పరిస్థితిని బట్టి అనారోగ్య కారణాల వల్ల గుర్తించినట్లు తాము భావిస్తున్నామని శవపంచనామ కోసం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతదేహం మీద గ్రే కలర్ డిజైన్ లుంగీ, నడుముకి నల్లని మొలతాడు ఉన్నట్లు తెలిపారు. పై వివరాలు ఎవరికైనా తెలిస్తే రైల్వే పోలీసు వారిని సంప్రదించాలని కోరారు.

## అబ్దుల్‌అజీజ్‌కి కిడ్నీకి స్టంట్



**నెల్లూరు జూలై 25, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ అబ్దుల్‌అజీజ్ అనారోగ్య కారణంగా జూన్ నెలలో చెన్నై అపోలో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. అందులో భాగంగా అపోలో వైద్యులు ఆయన కిడ్నీకి స్టంట్ వేశారు. నెలరోజుల తరువాత స్టంట్‌ను తీసివేశారు. అయితే అబ్దుల్‌అజీజ్ ఆరోగ్యం పూర్తిగా కోలుకోకపోవడంతో చికిత్స నిమిత్తం మంగళవారం అయన చెన్నై అపోలో అసుపత్రిలో చేరారు. మరోమారు అపోలో వైద్యులు ఆయన కిడ్నీకి స్టంట్ వేశారు. చెన్నై అపోలో సర్జరీ విజయవంతంగా ముగిసింది.

## పేరారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించిన టెక్స్ట్‌బుక్స్ డైరెక్టర్



**ఆత్మకూరు, జులై25ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలం పేరారెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను ప్రభుత్వ పాఠశాలల టెక్ట్ ్స బుక్స్ డైరెక్టర్ కె.రవీంద్రారెడ్డి మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను విద్యార్థులను ,ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సోమవారం భాస్కర్‌రెడ్డికి పలు సూచనలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులతో కూడిన విద్యను అందించాలనేలక్ష్యంతో కోట్లాది రూపాయలుఖర్చు చేస్తుందని , నాడునేడు పథకం ద్వారా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి చేస్తున్నారని, ఆంగ్లమాధ్యమాన్ని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించి వారిని కార్పోరేట్ పాఠశాలల కంటే మెరుగ్గా విద్యలో రాణించే విధంగా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేటా వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.